

స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం

భూపాలపల్లిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక (స్టాప్ వాయిలెన్స్ ఎగెనెస్ట్ ఉమెన్) దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి మల్లీశ్వరి ఆధ్వర్యంలో జరగ్గా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం డిసెంబరు 10 వరకు కొనసాగుతుందని, దీనిని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. స్త్రీలపై హింసను అరికట్టడంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.



పల్లెల్లో 'పోరు' ఘుమా..

- పల్లెల్లో వేడెక్కిన రాజకీయ వాతావరణం
- మొదలైన పంచాయతీ ఎన్నికల సందడి
- మొదటి విడతలో నాలుగు మండలాల్లో ఎలక్షన్
- గణపురం, కొత్తపల్లిగోరి, రేగొండ, మొగుళ్లపల్లిలో పోలింగ్

కృష్ణకాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పల్లె ల్లో రాజకీయాలు వేడెక్కాయి. పంచాయతీ ఎన్ని కల హోరు ప్రారంభమైంది. రెండు రోజుల క్రితమే రిజర్వేషన్లు ఖరారు కాగా మంగళవారం షెడ్యూల్ విడుదల కావడంతో గ్రామాల్లో సందడి జోరందుకుంది. పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరగనున్నాయి. తొలి విడత నామినేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభం కానుంది.

మొదటి విడత ఇలా..

మొదటి విడతలో భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం, కొత్తపల్లిగోరి, రేగొండ, మొగుళ్లపల్లి మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మండలాల్లో ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి విడతకు ఈ నెల 27 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. 29వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. 30న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. డిసెంబరు 1న అభ్యంతరాల స్వీకరణ, 2న అభ్యంతరాల పరిష్కరణకు చివరి అవకాశం, 3న నామిషన్ల ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం అభ్యర్థుల జాబితా విడుదల ఉంటాయి. డిసెంబరు 11న పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటల మొదలై మధ్యాహ్నం 1 గంటకు ముగియనుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు. అలాగే రెండో విడతలో చిట్యాల, టేకుమట్ల, భూపాలపల్లి, పలిమెల, మండలాలు, మూడో విడతలో మల్హర్, మహదేవపూర్, మహాముత్తారం, కాటారం మండలాలకు ఎన్నికలు జరగనున్నాయి.

అధికారుల నియామకం

పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనుండగా కలెక్టర్ రాహుల్ శర్మ నేతృత్వంలో యంత్రాంగం ఇందుకు సిద్ధమైంది. వివిధ శాఖల 13 మంది జిల్లా అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. వీరితో పాటు పీవో/ఏపీవోలు 3000 మంది, ఆర్‌వోలు 192 మంది, ఆర్‌వోలు 2,248 మంది, ఏఆర్‌వోలు 992 మంది విధులు నిర్వర్తించనున్నారు. మొత్తం ఎన్నికలకు 2,102 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా సరిపడా బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. ఇన్నాళ్లు రేగొండ మండలంలోని ఈజీఎస్ బిల్డింగ్‌లో భద్రపరిచిన 2,200 బ్యాలెట్ బాక్సులను అవసరం మేరకు ఎన్నికలు జరిగే ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు.

జిల్లాలో 3,02,147 మంది ఓటర్లు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గతంలో 241 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం కొత్తగా 7 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. దీంతో జిల్లాలో 248 గ్రామ పంచాయతీలు కొలువుదీరగా వీటిల్లో మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. అలాగే, కొత్తగా 32 వార్డులు ఏర్పడగా వాటితో కలుపుకొని 2,102 వార్డులు జిల్లాలో ఉన్నాయి. ఇప్ప టికే ఆయా గ్రామాల రిజర్వేషన్లు సైతం ఖరారయ్యాయి. గ్రామ పంచా యతీ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 3,02,147 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. వీరిలో పరుషులు 1,47,388 మం ది, 1,54,744 మంది మహిళలు ఉన్నారు. అలాగే, 15 మంది ఇతరులు ఉన్నారు. వీరంతా గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అధికారులతో కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 27వ తేదీ ఉదయం 10.30 గంటల లోపు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించి గ్రామపంచాయతీ కార్యాలయం, గ్రామ పంచాయతీలోని ప్రధాన కూడళ్లలో ప్రదర్శింపజేయాలని అన్నారు. అలాగే గ్రామపంచాయతీ కార్యాలయంలో ఓటరు జాబితా కూడా ప్రదర్శించాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని

(మిగతా 8వ పేజీలో)



- డిసెంబరు 1 నుంచి కొత్త మద్యం షాపులు ప్రారంభం
- పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌తో మద్యం వ్యాపారుల్లో జోష్
- ఓట్ల వేటలో మద్యం పంపిణీ షరా మాములే
- డిసెంబరు 17వ వరకు ఎన్నికలు ఉండటంతో మద్యానికి ఫుల్ డిమాండ్
- ఈ నెల 28నుంచే కొత్త మద్యం షాపులకు లిక్కర్ కేటాయింపులు
- ఉమ్మడి జిల్లాలో 294 మద్యం షాపుల యాజమానులు ఫుల్‌ఖుషీ

లిక్కర్‌షాపులకు ఎన్నికల కిక్కు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కొత్త మద్యం షాపులకు పంచాయతీ ఎన్నికలు కిక్కు ఇవ్వనున్నాయి. 2025-27 సంవత్సరానికి ఇటీవలే మద్యం షాపులకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించింది. గత అక్టోబరు 27న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 294షాపులకు లక్కీ డ్రా ద్వారా లిక్కర్ ఓనర్లను ఎంపిక చేశారు. డిసెంబరు 1వ తేదీ నుంచి కొత్త షాపులను ప్రారంభించేందుకు మద్యం షాపు యాజమానులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. దీంతో లిక్కర్ షాపుల యాజమానులకు షాపుల ప్రారంభంలోనే లాభాల కిక్కు తగలనుందనే టాక్ వినబడుతుంది. ఏడాది కాలంలో మేడారం మహజాతరతో పాటు పరిషత్తు, మునిసిపాలిటీ ఎన్నికలు కూడా నిర్వహించే అవకాశం ఉండటంతో ఈసారి మద్యం దుకాణాలు దక్కించుకున్న వారి మహ అదృష్టవంతులనే టాక్ వినబడుతుంది.

1న కొత్త మద్యం షాపులు

మద్యం షాపులకు లోకల్ బాడీ ఎన్నికలు కలిసి రానున్నాయి. వరంగల్ అర్బన్‌లో 67మద్యం షాపులు ఉండగా, వరంగల్‌రూరల్ జిల్లాలో 57 షాపులు, మహబూబాబాద్ జిల్లాలో 61 షాపులు, జనగామ జిల్లాలో 50, భూపాలపల్లి, ములుగు జిల్లాలో 59షాపులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 294మద్యం షాపులు ఉండగా, 10,493 దరఖాస్తులు వచ్చాయి. వీటికి సంబంధించి అక్టోబరు 27వ తేదీన లక్కీ డ్రా ద్వారా మద్యం షాపు యాజమానులను ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 28వ తేదీ నుంచి మద్యం కేటాయింపులు చేయనున్నారు. డిసెంబరు 1 నుంచి కొత్త మద్యం షాపుల్లో అమ్మకాలు చేయనున్నారు. రెండేళ్ల పాటు మద్యం అమ్ముకోవటానికి ప్రభుత్వం లైసెన్స్‌లు జారీ చేసింది. ఇప్పటికే ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, ఇన్‌స్టాల్‌మెంట్ పేమెంట్‌లు షాపు ఓనర్లు పూర్తి చేస్తున్నారు. బ్యాంకు గ్యారంటీలతో పాటు షాపు నిర్వహణకు అనువైన ప్రాంతంలో గదులను వెతికే పనిలో పడిపోయారు.

ఎన్నికల కిక్కు

కొత్త మద్యం షాపులకు ప్రారంభంలోనే పంచాయతీ ఎన్నికల రూపంలో కలిసి వస్తోంది. పాత షాపులకు నవంబరు 30వ తేదీ వరకు గడువు ఉన్నప్పటికి, కొత్త షాపులు ఈ నెల 28వ తేదీ నుంచే మద్యం కేటాయింపులు చేస్తున్నారు. డిసెంబరు 1 నుంచి అమ్ముకునేలా ఎక్సైజ్‌శాఖ అనుమతులను ఇస్తోంది. కాగా, ఇప్పటికే ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించింది. నవంబరు 27వ తేదీ నుంచి డిసెంబరు 17వ తేదీ వరకు మూడు విడతల్లో ఎన్నికలు జరుగనున్నాయి. తొలి విడత పంచాయతీ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల

(మిగతా 7లో..)

కాళేశ్వరాలయంలో ఎస్పీ పూజలు



ఎస్పీని సన్మానిస్తున్న ఆలయ ఈవో

మహదేవపూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరాలయాన్ని భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు పూర్ణకుంభం స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. స్వామి వారి శేషవస్త్రాలతో ఎస్పీని ఆలయ ఈవో ఎస్.మహేష్ సన్మానించారు. ఎస్పీ వెంట మహదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఎస్సై తమాషారెడ్డి ఉన్నారు.

మునిసిపల్ కమిషనర్‌గా ఉదయ్

భూపాలపల్లిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లికి మునిసిపల్ కమిషనర్‌గా కొయ్యడ ఉదయ్ కుమార్ బాధ్యతలు బుధవారం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఆయనకు అందించి అందించి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌గా పనిచేసిన శ్రీనివాస్‌ను ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఉదయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గ్రూపు 1 ద్వారా నూతన పోస్టింగ్‌లోనే భూపాలపల్లి మునిసిపల్‌కు ఆయన రావడం విశేషం.



నూతన కమిషనర్‌కు మొక్క అందిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

వ్యవస్థలన్నీ రాజ్యాంగానికి లోబడి పనిచేయాలి

సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు

గణపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశంలోని వ్యవస్థలన్నీ రాజ్యాంగానికి లోబడి పనిచేయాలని సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీనగర్‌లోని మహాత్మా జ్యోతీబాపూలే బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థినులతో సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గవర్నమెంట్ ప్లీడర్ సుధాకర్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసాచారి, న్యాయవాదులు పాల్గొన్నారు.

జెన్‌కో బీసీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన బీసీ అసోసియేషన్ కార్యవర్గం

గణపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్ట్రిసిటీ బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జెన్‌కో నూతన కమిటీని బుధవారం ఎన్నికైంది. కేటీపీపీ ఆవరణలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొడెపాక బిక్షపతి సమక్షంలో కార్యవర్గం ఖరారైంది. ప్రెసిడెంట్‌గా కొమరవెల్లి రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొండపాక బాలబ్రహ్మచారి, సెక్రటరీ పిల్లి అశోక్, లైజన్ ఆఫీసర్‌గా హరికృష్ణ, ట్రెజరర్‌గా వినోద్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకన్న, బ్రహ్మేంద్రరావు, విజయ్‌కుమార్ హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సీఈ శ్రీప్రకాశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఉద్యోగుల సమస్యలపై చర్చించింది.

బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష

భూపాలపల్లిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నిరాహార దీక్షను నిర్వహించారు. బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ పైడిపల్లి రమేష్ ఆధ్వర్యంలో చేపట్టగా వివిధ సంఘాలు, పార్టీల నాయకులు పాల్గొన్నారు. రమేష్ మాట్లాడుతూ తెలంగాణలోని 12,735 గ్రామాలకు 2,176 గ్రామాలు మాత్రమే బీసీలకు ఇచ్చి 17.08 శాతం రాజర్వేషన్లతో ప్రభుత్వం చేసిన మోసానికి నిరసనగా దీక్షను చేపట్టినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపులో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దొంగల రాజేందర్, అనిల్, టీడీపీ నాయకులు భాస్కర్, కాంగ్రెస్ నాయకులు సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి అంబేద్కర్ కూడలి వద్ద నిరాహార దీక్ష చేస్తున్న బీసీ జేఏసీ నేతలు

గంజాయి రవాణా కేసులో పదేళ్ల జైలు

గణపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా కేసులో నిందుతులకు పదేళ్ల జైలు ఖరారైనట్లు ఎస్సై అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021లో చెల్పూరు నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ఘటన చోటుచేసుకుందని పేర్కొన్నారు. చెల్పూరుకు చెందిన బానోత్ బాబుకుమార్, ధరావత్ మల్సూర్, గోపు శ్రీధర్‌రెడ్డి, కొంరెడ్డి రవీందర్‌రెడ్డి, అంగోత్ రాజేందర్‌పై అప్పటి ఎస్సై కేసులు నమోదు చేశారన్నారు. నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు, రూ. లక్ష జరిమానా చొప్పున విధిస్తూ జిల్లా ప్రధాన జడ్జి రమేష్ తీర్పునిచ్చారని ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయులకు పీఆర్సీని ప్రకటించాలి

టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి



సమావేశంలో మాట్లాడుతున్న ములుకల్ల తిరుపతి

కాటారం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని వెంటనే ప్రకటించి ఉపాధ్యాయులపెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ములుకల్ల తిరుపతి డిమాండ్ చేశారు. కాటారం మండల కేంద్రం లోని వివేకానంద పాఠశాలలో టీపీయూఎస్ డివిజన్ స్థాయి కార్యవర్గ సమా వేశం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి మాట్లాడు తూ రెండున్నరేళ్లుగా ప్రభుత్వాలు పీఆర్సీని ప్రకటించకుండా వాయిదా వేస్తున్నాయని, దీంతో టీచర్లు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం తలెత్తిందని అన్నారు. ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురిచేయకుండా ప్రభుత్వం వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మండల కార్యవర్గాలు ఎన్నిక

డివిజన్‌స్థాయి సమావేశం అనంతరం టీపీయూఎస్ మండల కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారిగా నల్ల శ్రీధర్‌రెడ్డి వ్యవహరించారు. కాటారం మండల అధ్యక్షురాలిగా బూరం స్వరూప, ప్రధాన కార్యదర్శిగా నీల శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడిగా కడివెండి ప్రభాకర్, అసోసియేట్ అధ్యక్షుడిగా సోమ సురేష్, ఉపాధ్యక్షుడిగా ఎలబోయిన శ్రీకాంత్ ఎన్నికయ్యారు. మల్హర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జంగిలి రాజేందర్, మురళీమనోహర్‌రావు, మహాముత్తారం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చెరిపల్లి విజయ్ కుమార్, పంజాల అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి, జిల్లా, మండల సీనియర్ నాయకులు సుధాకర్, రవీంద్రనాథ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డుస్థానాలకు ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ టీఎస్.దివాకర ఆదేశించారు. బుధవారం ఆయన తన చాంబర్ నుంచి అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేష్ డీపీవో శ్రీధర్‌లతో కలిసి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలతో మాట్లాడారు. ఈనెల 27న ఉదయం 10.30 గంటలలోపు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించి గ్రామపంచాయతీ కార్యాలయం, ప్రధాన కూడళ్లలో ప్రదర్శింపజేయాలన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఓటరు జాబితా కూడా ప్రదర్శింపజేయాలని, ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమని అన్నారు. ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధనల పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలన్నారు. అధికారులు, సిబ్బంది పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సాఫీగా జరిగేలా కృషి చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, పోస్టర్లు, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల గోడలపైరాతలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. నిఘా బృందాలను నియమించి పకడ్బం దీగా కోడ్ అమలు జరిగేలా పర్యవేక్షించాలని, ఓటర్లను ప్రభావితం చేసే చర్యను ఎక్కడికక్కడ నిరోధించాలని అన్నారు. మద్యం, డబ్బు పంపకాలు, ఇతర ప్రలోభాలకు గురిచేసే వస్తువుల పంపిణీపై పటిష్ఠ నిఘా ఉంచాలన్నారు. ఓటరు జాబితాను మరోమారు నిశితంగా పరిశీలించి ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే గమనించి తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి జాగ్రత్తగా సరిచూసుకోవాలని, పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఎక్కడైనా సదుపాయాలు లేకపోతే యుద్ధ ప్రాతిపదికన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, విద్యుత్ వంటి సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్ పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి

మహదేవపూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉప ప్రధాన అర్చకుడు ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు చేశారు. భక్తులకు అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మంగపేటలో..

మంగపేట (ఆంధ్రజ్యోతి): సుబ్రమణ్య షష్ఠిని పురస్కరించుకుని ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని ఉమా చంద్రశేఖర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకుడు విస్సవజ్జుల నరేష్‌శర్మ ఆధ్వర్యంలో వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామికి అభిషేకాలు చేశారు. ఈ వేడుకల్లో మంగపేటతో పాటు మండలంలోని కమలాపురం, కొత్తపేట గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

దత్తాత్రేయస్వామి నవరాత్రోత్సవాలు ప్రారంభం



గణపతి, నవగ్రహ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

కాటారం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్వాడ శ్రీదత్తాత్రేయ స్వామి ఆలయంలో బుధవారం దత్త నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు రాంభట్ల కృష్ణమోహన్, పనకంటి ప్రవీణ్, వేదాంతం గణేష్, సుమిత్‌పాండే గణపతి పూజ, పుణ్యావచనం, అఖండ దీపారాధన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం కాళేశ్వరం, మంథనిలకు చెందిన వేదపండితులు, స్థానిక అర్చకులతో కలిసి గణపతి, నవగ్రహహోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తల్లి జయశ్రీ ప్రత్యేక పూజలు చేశారు. కళాకారులు, పలు భజనబృందాలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

సమాజ నిర్మాణంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకం

జనగామ కల్చరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జనగామ ఏఎంవో బొమ్మనబోయిన శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని పెంబర్తి జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో వ్యాయామ విద్య ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మంచి సమాజాన్ని నిర్మింపజేసే భావి భారత పౌరులను తయారు చేయడంలో ప్రముఖమైన పాత్ర వ్యాయామ విద్య ఉపాధ్యాయులదే ఉంటుందన్నారు. కాబట్టి పాఠశాలలో చదివే విద్యార్థులకు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, క్రీడా కౌశలా లు, మానసికుద్వేగాలకు లోను కాకుండా వ్యాయామ విద్యలో తర్ఫీదునిచ్చి గొప్ప సమాజాన్ని నిర్మింపజేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.నాగరాణి, డీఆర్పీలు గంగిశెట్టి మనోజ్‌కుమార్, కైరిక హనుమంతరావు, ఆవుల అశోక్, జనగామ పాఠశాల క్రీడా కార్యదర్శి జాటోతు గోర్‌సింగ్ పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా యంత్రాంగం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



ఎస్పీతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు యంత్రాంగం సర్వం సన్నద్ధంగా ఉందని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 12 మండలాల్లో మూడు దశలుగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 12 మండలాల పరిధిలో 248 గ్రామపంచాయతీల్లో 2,012 వార్డులు ఉన్నాయని ఆయన తెలిపారు. మొదటి విడతలో గణపురం, కొత్తపల్లిగోరి, రేగొండ, మొగుళ్లపల్లి మండలాల్లోని 82 గ్రామ పంచాయతీల పరిధిలోని 712 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండో విడతలో చిట్యాల, టేకుమట్ల, భూపాలపల్లి, పలిమెల మండలాల పరిధిలోని 85 గ్రామ పంచాయతీల్లోని 694 గ్రామ పంచాయతీలకు, మూడో విడతలో మల్హర్, మహదేవపూర్, మహాముత్తారం, కాటారం మండలాలలోని 81 గ్రామ పంచాయతీలలోని 696 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు.

జిల్లాలో మొత్తం 3,02,147 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 14,7388 మంది, మహిళలు 15,4744 మంది, ఇతరులు 15 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికలు నిర్వహణకు 77 కస్టర్లుగా విభజించామని తెలిపారు. 2,523 మంది పీవోలు, 3,059 మంది ఓపీవోలు, 92 మంది స్టేజీ 1 రిటర్నింగ్ అధికారులు, 278 మంది స్టేజీ 2 రిటర్నింగ్ అధికారులు, ఏఆర్వోలు 93 మంది, జోనల్ అధికారులు 42 మంది, ఎఫ్ఎస్టీ 40 మంది విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 27వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని, దీనికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. 2,102 బ్యాలెట్ బాక్సులు అవసరం కాగా 20శాతం రిజర్వ్‌డ్‌తో 2,523 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఇవి మూడు రోజులు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, ఎంసీసీ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ఉల్లంఘన నియమావళిపై ఫిర్యాదులు చేసేందుకు వీలుగా 24గంటలు పనిచేసేలా మొబైల్ నంబరును 9030632608 అందుబాటులో ఉంచామన్నారు.

ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ఠ భద్రతా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 12 మండలాల్లో బందోబస్తు పర్యవేక్షణకు ప్రత్యేక పోలీస్ టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 70రూట్లుగా విభజించినట్లు చెప్పారు. పటిష్ఠ పోలీస్‌బందోబస్తు మధ్య పోలింగ్ మెటీరియల్ తరలించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 312 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 30 సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. ఏదైనా ఉల్లంఘన జరిగితే 24గంటలు పనిచేసేలా ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూమ్ 8712658178 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందకుండా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, డీపీఆర్‌వో శ్రీనివాస్, అడిషనల్ పంచాయతీ అధికారి మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సహకరించాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ములుగు కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ టీఎస్.దివాకర కోరారు. తన చాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పక పాటిస్తూ గ్రామపంచాయతీ ఎన్నికను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున రాజకీయ పార్టీలకు సంబంధించి రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ప్రైవేట్ స్థలాల్లో 72 గంటల వ్యవధిలో పూర్తిస్థాయిలో తొలగించామన్నారు. ఈనెల 27 నుంచి 29 వరకు ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు.

30న సాయంత్రం 5గంటలకు చెల్లుబాటైన నామినేటెడ్ అభ్యర్థుల జాబితా ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు జాబితాపై అప్పీళ్ల కోసం డిసెంబరు 1న సాయంత్రం 5గంటల వరకు గడువు ఉంటుందని అన్నారు. డిసెంబరు 2న అప్పీళ్లను పరిష్కరించాలని, నామినేషన్ల ఉపసంహరణకు 3వతేదీ మధ్యాహ్నం 3గంటల వరకు గడువు ఉంటుందని, అదేరోజు పోటీచేసే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేశ్, డీపీవో శ్రీధర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గుప్తనిధులు దొరికాయా?

చిట్యాల, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని నాపాక ఆలయ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు చేపట్టడం కలకలం రేపింది. ఈ తవ్వకాల్లో గుప్తనిధులు లభ్యమయ్యాయా.. లేదా? అనేది చర్చనీయాంశమైంది. నైన్‌పాక శివారు ఏకశిలా క్షేత్రం నాపాక లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలో సోమవారం అర్ధరాత్రి జేసీబీతో తవ్వకాలు చేపట్టిన సంగతి తెలిసిందే. నైన్‌పాక, వరికోల్‌పల్లి, కుమ్మరిపల్లి గ్రామాలకు చెందిన ఎనిమిది మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ తవ్వకాల వెనుక ఎవరెవరు ఉన్నారు.. సూత్రధారులు ఎవరు? వీరికి గుప్త నిధులు దొరికాయా? అనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ఇలాంటి మరెన్నో ఘటనలు రెండేళ్ల కాలంలో మండలంలో చోటుచేసుకున్నాయని తెలుస్తోంది. వరికోల్‌పల్లి శివారు నందిబోడుగుట్టలు, బావుసింగ్‌పల్లిలోని ఓ ఇంట్లో, తాజాగా నాపాక ఆలయం ఆవరణలో గుప్త నిధులు తవ్వకాలు చేపట్టడం చర్చనీయాంశమైంది.

కంచనపల్లిలో చోరీ

రూ 1.50 లక్షల నగదు, రెండున్నర తులాల బంగారం అపహరణ

రఘునాథపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇంట్లో బీరువాలో దాచిపెట్టిన రూ.1.50 లక్షల నగదుతో పాటు రెండున్నర తులాల బంగారం, 30 తులాల వెండి చోరీకి గురైన సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని కంచనపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దురుసోజు సందీప్ ఎలక్ట్రిషన్‌గా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ప్రస్తుతం తన కుటుంబం నివాసముంటున్న ఇల్లు మట్టి గోడలతో నిర్మించినందున శిథిలావస్థకు చేరుకోగా, కొత్త ఇంటి నిర్మాణం కోసం పొదుపు చేసిన రూ.1.50 లక్షల నగదుతో పాటు రెండున్నర తులాల బంగారం, 30 తులాల వెండిని తన ఇంట్లో ఉన్న బీరువాలో దాచిపెట్టాడు.

మట్టితో కట్టిన ఇల్లు కూలిపోతుందన్న భయంతో తన ఇంటి పక్కన ఉన్న మొగిలయ్య ఇంట్లో రాత్రి పూట తన కుటుంబ సభ్యులతో కలిసి పడుకుంటున్నాడు. ఇదే అదనుగా భావించిన కొందరు గుర్తు తెలియని దుండగులు ఇంట్లోని బీరువాను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం ఇంటికి వెళ్లి చూసేసరికి బీరువా పగుల గొట్టి ఉండడంతో పాటు బీరువాలోని బట్టలన్ని చిందరబందరగా పడి ఉన్నాయి. దీంతో భయాందోళనకు గురైన బాధితులు బీరువాను పరిశీలించారు. బీరువాలోని నగదుతో పాటు బంగారం, వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ జరిగిన ఇంటి పరిసరాలను సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ డి.నరేష్ సందర్శించి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మిర్చి రైతులకు అవగాహన

కృష్ణకాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామంలో ధనుక అగ్రిటెక్ కంపెనీ ఆధ్వర్యంలో మిర్చి రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సింగరేణి ఏరియా మేనేజర్ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. పంటలో రసం పీల్చే పురుగులు, తెల్లదోమ, పచ్చదోమ, తామెర పురుగు, పెనుబంక వంటి కీటకాల నివారణకు ధనుక వారి డిసైడ్ 500 గ్రాములు ఎకరానికి వాడాలని సచించారు. అదే విధంగా 10 రోజుల తర్వాత లానేవో 250 ఎంఎల్ ఎకరానికి వాడితే కాయ తొలిచే, రసం పీల్చే పురుగులను దీర్ఘకాలికంగా నివారించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల టెరిటరీ మేనేజర్ కొత్త జితేందర్‌రెడ్డి, భూపాలపల్లి ఎస్ఆర్ దొంగల అనిల్‌కుమార్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులనే సర్పంచ్‌లుగా గెలిపించాలి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమని, పంచాయతీ ఎన్నికల్లో ఆ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లిలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి పార్టీ ప్రకటించిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు వచ్చిన గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కడైనా ఆర్థికంగా బలహీనంగా ఉంటే ఆ గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు ఆ అభ్యర్థి విజయానికి పూర్తిస్థాయి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో గణపురం, రేగొండ, మొగుళ్లపల్లి, గోరికొత్తపల్లి గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలు గుణపాఠం చెప్పాలి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల పేరుతో నమ్మించి గొంతు కోసిన సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలు తగిన గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. ఈ నెల 29న జరగనున్న దీక్షా దివస్, వచ్చే నెలలో జరిగే పంచాయతీ ఎన్నికలపై భూపాలపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధించిన నాటి ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ ఈ నెల 29న రాష్ట్రమంతా నిర్వహిస్తున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి జిల్లాలోని కార్యకర్తలంతా పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సీఎంగా పనిచేసిన కేసీఆర్ అప్పట్లో బీసీలకు 24 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి మోసం చేసిందని దుయ్యబట్టారు. ప్రస్తుతం రిజర్వేషన్‌లను కేవలం 17 శాతానికే పరిమితం చేశారని మండిపడ్డారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసే అభ్యర్థులు అధికంగా గెలుపొందేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కళ్లెపు రఘుపతిరావు, మండల విద్యాసాగర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తేనెటీగల పెంపకం శిక్షణ



శిక్షణ పొందిన వారితో ఏఎంసీ చైర్‌పర్సన్, అధికారులు, నిర్వాహకులు

కాటారం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నేషనల్ బీ బోర్డ్ (ఎన్‌బీబీ) సహకారంతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఆయిల్ సీడ్ మిషన్‌లో భాగంగా తేనె ఉత్పత్తి, నూనె గింజల ఉత్పాదకతను పెంచడంపై వారం రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 25మంది రైతులకు ఎన్ఐపీహెచ్ఎం ఏడీ జ్యోతి, అసిస్టెంట్ సైంటిఫిక్ ఆఫీసర్ శక్తివేల్, నేచురల్ హనీ ఫౌండర్ సంజన పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహాముత్తారం మండలంలోని మహబూబ్‌పల్లిలో తేనెటీగల పెంపకానికి అనువైన ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ పంతకాని తిరుమల, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, రైతులు పోచిరెడ్డి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, ప్రతాప్, మధు, అశోక్, కుమార్, రాజేంద్రప్రసాద్, రమేష్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఏఎంసీ సిబ్బంది మల్లికార్జున్, సత్యం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసం సంఘాల ఆరాటం

● బీఎంఎస్ వర్కింగ్ అప్పాని శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న అప్పాని శ్రీనివాస్

కృష్ణకాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్మిక కోడ్లతో 40 కోట్ల అసంఘటిత కార్మికులకు ప్రయోజనం కలగనుందని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే పలు కార్మిక సంఘాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. భూపాలపల్లిలోని బీఎంఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన నాలుగు కార్మిక చట్టాల కోడ్లు కార్మికులందరికీ అనుకూలంగా ఉన్నాయని, దీన్ని బీఎంఎస్ స్వాగతిస్తోందని తెలిపారు. బ్రిటీష్‌కాలంలోని పాత చట్టాలను మార్చి, నూతన కార్మిక కోడ్లుగా కేంద్రం తీసుకొచ్చిందన్నారు. సమావేశంలో వెలబోయిన సుజేందర్, పాండ్రాల మల్లేష్, రమేష్, కొత్తూరు మల్లేష్, రఘుపతిరెడ్డి, అన్నం శ్రీనివాస్, తాండ్ర మొగిలి, దాసరి ఓదేలు, కె. భాస్కర్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



శ్యామక్క(ఫైల్)

గణపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు గడ్డమీది శ్యామక్క(102) బుధవారం ఉదయం మృతిచెందింది. 1923లో శ్యామక్క జన్మించినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. భర్త ముత్తయ్య 25ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. శ్యామక్కకు నలుగురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. 70మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారని, శ్యామక్క ఐదు తరాల సంతానాన్ని చూసిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

హత్య కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు, జరిమానా

వరంగల్ లీగల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అత్తపై దాడిచేసి హత్యకు కారణమైన వ్యక్తికి ఏడేళ్ల కఠిన కారాగారా శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా సెషన్స్ జడ్జి బీవీ నిర్మల గీతాంబ బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ సుజ్జిత్ నగర్‌కు చెందిన వెంకటమ్మకు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వారిలో సునితను వంగ సంపత్‌కు ఇచ్చి వివాహం చేశారు. వివాహ అనంతరం అత్త వెంకటమ్మకు చెందిన ఖాళీ స్థలంలో అల్లుడు సంపత్ రెండు రూములు నిర్మించి ఒక రూములో తాను, మరో రూంలో అత్త నివాసం ఉంటున్నారు.

ఈ క్రమంలో అత్త వెంక టమ్మ తన అల్లుడు సంపత్ సరిగా చూసుకోవడం లేదని అనారోగ్యంతో ఉన్నాతనను పట్టించుకోవడం లేదని ప్రతీరోజు గొడవ పడుతుండేది. ఇదిలా ఉండగా 2023 ఆగస్టు 23న మద్యం సేవించి ఇంటికి వచ్చిన నిందితుడు సంపత్ అత్తపై సుత్తెతో తలపై కొట్టి పారిపోగా వెంకటమ్మను చికిత్స కోసం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. నిందితుడి వంగ సంపత్‌పై పోలీసులు హత్యానేరం కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు పీసీ దాడి శ్రీనివాస్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారిగా ఎన్. కరుణాకర్‌రావు వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

ఎన్నికల్లో.. ఎన్ని కలలో..

- పంచాయతీ పోరుపై పల్లెల్లో జోరుగా మంతనాలు
- సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలపై దృష్టి
- పార్టీల గుర్తులు లేకుండా ఎన్నికలు
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న అన్ని పార్టీలు



హనుమకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు కావడం, ఎన్నికల షెడ్యూల్ కూడా జారీ కావడంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ కాగానే ఈనెల 27 నుంచి మొదటి విడత ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల దాఖలు కూడా మొదలవుతుంది. దీంతో పల్లెల్లో మంతనాలు జోరందుకున్నాయి. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు రంగంలోకి దిగుతున్నారు. ముఖ్యంగా సర్పంచ్ పీఠంపై కన్నేసిన వారంతా జిల్లా, రాష్ట్ర నాయకులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో పడ్డారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగకున్నా గ్రామ స్థాయిలో తమ పార్టీ పునాదులను పటిష్ఠం చేసుకోవడానికి అభ్యర్థులను రాజకీయ పార్టీలు బలపరుస్తాయి.

మంతనాల జోరు

రిజర్వేషన్ల అనుకూలత, గెలుపు అవకాశాలపై లెక్కలు వేసుకొని అప్పుడే ఆశావహులు ఎమ్మెల్యేలతో మంతనాలు జరుపుతున్నారు. ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్ల వివరాలు తెలుసుకొని ఆ మేరకు ఆ పంచాయతీల్లో పోటీ చేసి గెలిచే సత్తా ఉన్న అభ్యర్థులను గుర్తించే పనిలో పడ్డారు. మండలాల వారీగా ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో తాజా రాజకీయ పరిస్థితులు, పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. మండల స్థాయి నాయకుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. అధికార పార్టీ నాయకుల్లో గెలుపు ధీమా అధికంగా ఉంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వు అయిన గ్రామ పంచాయతీల్లో కొంచెం ఆర్థిక పరపతి ఉన్నవారు పోటీకి సన్నద్ధమవుతున్నారు. సర్పంచ్ పదవులకు పోటీ ఎక్కువ ఉన్న చోట అసంతృప్తి చోటు చేసుకోకుండా పార్టీ నాయకులు ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో ఒకరిని సర్పంచ్, మరొకరిని ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలోకి దింపాలని యోచిస్తున్నారు. పల్లెల్లో పట్టు సాధించేందుకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. పార్టీ గుర్తులు లేకపోయినా తమ కార్యకర్తలను గెలిపించుకోవాలనే లక్ష్యంతో కసరత్తు చేస్తున్నాయి.

కాంగ్రెస్ వ్యూహాలు

అధికార కాంగ్రెస్ పార్టీ గెలుపు ధీమాతో కొద్ది నెలల నుంచే పావులు కదుపుతోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలను గంప గుత్తగా తన ఖాతాలో వేసుకోవడానికి ప్రయత్నించినప్పటికీ కోర్టు తీర్పులతో ఆ వ్యూహం బెడిసికొట్టింది. అయినా కూడా జనరల్ స్థానాల్లో వీలయినంత ఎక్కువ మంది బీసీలకు పార్టీ పక్షాన మద్దతు ఇవ్వడం ద్వారా వారి గెలుపు కోసం కృషి చేయాలని యోచిస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకం కావడంతో వారిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో భాగంగా ఎన్నికల షెడ్యూల్ జారీ కావడానికి ముందే ఇందిరమ్మ చీరల పంపిణీ పూర్తి చేసింది. దీంతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యుల మద్దతును కూడగట్టుకునేందుకు కూడా కోడ్ అమలుకు కొన్ని గంటల ముందే వడ్డీ లేని రుణాలను విడుదల చేసింది. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు, గృహజ్యోతి వంటి సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా గ్రామీణ ఓటర్లను ఆకట్టుకునే పనిలో ఉంది.

బీజేపీ ఆరాటం

మరో వైపు బీజేపీ కూడా పంచాయతీ ఎన్నికల్లో ఖాతాలను తెరవాలని చూస్తోంది. వీలైనంత మేరకు తమ పార్టీ నాయకులు సర్పంచులుగా గెలిచేలా వ్యూహరచనలు చేస్తోంది. వాస్తవానికి గత పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ మద్దతు దారుల్లో ఎక్కువ మంది సర్పంచ్‌లుగా గెలవలేక పోయారు. ఫలితంగా గ్రామ స్థాయిలో ఆ పార్టీ పునాదులు అంత బలంగా లేవు. ఈ దృష్ట్యా పల్లెల్లో పార్టీని విస్తరించేందుకు, పునాదులను పటిష్ఠపరుచుకునేందుకు పంచాయతీ ఎన్నికలను ఒక అవకాశంగా వాడుకోవాలని చూస్తోంది.

బీఆర్‌ఎస్‌కు సవాల్

మరో వైపు బీఆర్‌ఎస్ పార్టీ కూడా తన వంతు ప్రయత్నాలను మొదలు పెట్టింది. గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరపరాజయం చవి చూసిన ఆ పార్టీ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా పునరుజ్జీవనం పొందే ఆలోచనలో ఉంది. ఈ మేరకు గత పదేళ్ల పాలనలో పంచాయతీల అభివృద్ధికి చేసిన కృషిని, గ్రామాల్లో కల్పించిన మౌలిక వసతులను గుర్తు చేయడం ద్వారా పల్లె ఓటర్లను ప్రసన్నం చేసుకునే దిశగా వ్యూహాలను రచిస్తోంది. పల్లెల్లో బీఆర్‌ఎస్‌కు ఇప్పటికీ గట్టి పునాదులే ఉన్నాయి. క్యాడర్ ఉంది. క్రియాశీల నాయకులు ఉన్నారు. వారందరిలో ఉత్సాహం నింపడం ద్వారా పంచాయతీ ఎన్నికల్లో గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు నడుం బిగిస్తున్నారు. పనిలో పనిగా కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా ఓటర్లను ఆకట్టుకోవాలని చూస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు తమకు అనుకూలంగా మారుతుందని ఆ పార్టీ నాయకులు బలంగా నమ్ముతున్నారు.

ఎన్నికల వ్యయాలపై నిఘా

వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం ఓటింగ్ సమయంలో వెబ్ కాస్టింగ్‌తో పాటు వీడియోగ్రఫీ నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు వరంగల్ కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. బుధవారం రాత్రి సర్పంచ్ అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పరిమితుల విషయంలో వివరాలను ప్రకటించారు. 5 వేల జనాభా పైబడిన గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.2.5 లక్షలు, వార్డు సభ్యులు రూ.50వేలు, 5 వేల జనాభా లోపున్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.1.5 లక్షలు, వార్డు సభ్యులు రూ.30 వేల వరకు మాత్రమే ఖర్చు చేయాలన్నారు. అన్ని మండల కేంద్రాల్లో క్లస్టర్లను ఏర్పాటు చేశామని, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు తమ క్లస్టర్ పరిధిలో సూచించిన పంచాయతీల్లో నామినేషన్ పత్రాలను సమర్పించవచ్చని వెల్లడించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు, 2024 ఎస్‌సీపీసీ సర్వే ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు కేటాయించామని స్పష్టం చేశారు.

భర్త ఫంక్షన్‌కు తీసుకుపోలేదని..

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

సంగెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భర్త ఫంక్షన్‌ను తీసుకుపోలేదని భార్య క్షణికావేశంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలోని ఎల్గూరు రంగంపేటలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఎల్గూరు రంగంపేటకు చెందిన గుగులోత్ కవిత(28), తన భర్త సుకుమార్ ఫంక్షన్‌కు వెళ్లే విషయంలో గొడవ పడ్డారు. సుకుమార్ తన ఇద్దరు పిల్లలను తీసుకుని బొల్లికుంటలో జరిగిన ఫంక్షన్‌కు వెళ్లాడు. మనస్తాపం చెందిన కవిత ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు భూక్యా రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కూతుళ్ల పెళ్లి చేయలేక..

రాయపర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కూతుళ్ల వివాహాలు చేయలేక, కుటుంబాన్ని పోషించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కొత్తూరులో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తూరు గ్రామానికి చెందిన భీమని యాదగిరి (52) కూలీ చేసుకుని జీవిస్తున్నాడు. మొదట వివాహం చేసుకోగా ఇద్దరు పిల్లలు కాగా, భార్య అనారోగ్యంతో చనిపోయింది. దీంతో రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్యకు సైతం ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు.

మొత్తం ఐదుగురు కాగా, ఇద్దరి వివాహాలు చేశాడు. దీంతో మిగతా వారికి వివాహాలు చేయాలన్నా, కుటుంబాన్ని పోషించలేక మనోవేదనకు గురయ్యేవాడు. ఈ నెల 25న ఉదయం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా సాయంత్రం 5 గంటల సమయంలో ఊరి చివర చెట్టుకు యాదగిరి ఉరి వేసుకుని ఉండడం కంటపడింది. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో మృతుడి తల్లి భీమని రామలచ్చమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిజీ బిజీగా కేటీఆర్ పర్యటన

ఘన స్వాగతం పలికిన గులాబీ శ్రేణులు

హనుమకొండ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం ఘన స్వాగతం పలికారు. దీక్షాదివాస్ సన్నాహక సమావేశానికి హైదరాబాద్ నుంచి ఉదయం హనుమకొండకు బయలుదేరిన కేటీఆర్‌కు కరుణాపురం వద్ద ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదుట బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి కాజీపేట జంక్షన్‌లోని బాపూజీ నగర్ చౌరస్తాకు చేరుకోగా స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. మధ్యాహ్నం రంగశాయిపేటకు చేరుకోవడంతో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

కేటీఆర్ అక్కడి నుంచి గీసుగొండ మండలంలోని టెక్స్‌టైల్ పార్కు సందర్శన ముగించుకుని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. సుమారు 2000 మంది బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో దీక్షాదివాస్ సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అక్కడి నుంచి మడికొండలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ నాయకుడి కూతురి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించి జనగామ దీక్షాదివాస్ సన్నాహక సమావేశానికి వెళ్లారు. కేటీఆర్‌కు స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ మాలోతు కవిత, బీఆర్‌ఎస్ నాయకులు జోరిక రమేష్, పోలెపల్లి రామ్మూర్తి, పులి రజనికాంత్, బుద్దె వెంకన్న, సోదా కిరణ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఉన్నారు.

భలే రుచిగా ఉన్నాయి..

బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో దీక్షాదివాస్ సన్నాహక సమావేశంలో కేటీఆర్ పాల్గొని తిరిగి వెళ్తున్న క్రమంలో కార్యాలయం ఎదురుగా ఉన్న తెలంగాణ పిండి వంటల షాప్‌ను సందర్శించారు. ఆయనకు మహిళలు తినుబండారాలు అందజేశారు. వాటిని రుచి చూసిన కేటీఆర్.. భలే రుచిగా ఉన్నాయని కితాబు ఇచ్చారు. అనంతరం కొన్ని పిండివంటలు ఇంటికి తీసుకెళ్లారు. షాప్ నిర్వాహకులు ఉమాదేవి, ఉష, అర్చనలు పిండి వంటల గురించి కేటీఆర్‌కు వివరించారు.

కేటీఆర్ కాన్వాయ్ ఢీకొని ఒకరికి గాయాలు



కాన్వాయ్ ఢీకొని కింద పడిన ద్విచక్ర వాహనదారుడిని పైకి లేపుతున్న స్థానికులు

హనుమకొండ టౌన్ : బాలసముద్రంలోని చిల్డ్రన్స్ పార్కు సమీపంలో బుధవారం కేటీఆర్ ప్రయాణించిన కాన్వాయ్‌లోని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. సుబేదారి సీఐ మేకల రంజిత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పరకాలకు చెందిన శ్రీనివాస్ రెడ్డి రాపిడో ద్విచక్ర వాహనంపై చిల్డ్రన్స్ పార్కు జంక్షన్ వైపు వస్తుండగా మూల మలుపు వద్ద కేటీఆర్ కాన్వాయ్‌లోని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడి తలకు గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే పోలీసులు వచ్చి శ్రీనివాస్ రెడ్డిని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా, ప్రమాదానికి కారణమైన కారులో కేటీఆర్ లేరు. అయితే కేటీఆర్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి వెళ్లిందని పలువురు స్థానికులు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో కలకలం రేగింది.

టెక్స్‌టైల్ పార్కుతో మహర్దశ

- స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గీసుగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)తో వరంగల్‌కు పూర్వవైభవం తీసుకురావడానికి నాటి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషిచేశారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. ఒకప్పుడు అజాంజాహి మిల్‌తో వరంగల్‌కు వస్త్రపరిశ్రమ గుర్తింపు ఉండేదని, అది కనుమరుగైన తరువాత కేఎంటీపీతో టెక్స్‌టైల్ హబ్‌గా మళ్లీ పూర్వవైభవం సంతరించుకోబోతుందని హర్షం వ్యక్తంచేశారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని చింతలపల్లి వద్ద టెక్స్‌టైల్ పార్కును బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కైటెక్స్ కంపెనీలో ఆధునాతన పద్ధతిలో జరుగుతున్న టెక్స్‌టైల్ ఉత్పత్తులను పరిశీలించారు. ఉత్పత్తుల వివరాలను కంపెనీ ఎం.డి. మనోజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడారు.

సూరత్, షోలాపూర్, బీవండి వంటి ప్రాంతాలకు నేతన్నల వలసలను అరికట్టేందుకు టెక్స్‌టైల్‌పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. ఆనాడు దేశంలో వస్త్ర పరిశ్రమలకు ఎలాంటి పాలసీలు లేవని, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో మన దేశం కంటే ఎక్కువగా వస్త్ర ఉత్పత్తులు జరుగుతుండడంతో దేశంలో అతిపెద్ద కాకతీయ టెక్స్‌టైల్ పార్కుకు రూపకల్పన చేసినట్లు వివరించారు. సూరత్, తిరుపూర్‌లా ఫామ్ టు ఫ్యాషన్ తరహాలో కైటెక్స్, యంగ్‌వన్ వస్త్ర పరిశ్రమలు చురుకుగా ఏర్పాటు అవుతున్నాయన్నారు. స్థానిక పత్తి రైతులకు, కూలీలకు ఉపాధి లభించే విధంగా పరిశ్రమలు ఏర్పాటు జరగాలని భావించినట్లు చెప్పారు. గణేషా, కైటెక్స్, యంగ్‌వన్ కంపెనీలు ఉత్పత్తులను ప్రారంభించడంతో దాదాపు 30వేల మందికి ప్రత్యక్షంగా అంతకు డబుల్ పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదన్నారు. పార్కు ఏర్పాటైన నాలుగు సంవత్సరాల తరువాత కేంద్రం పీఎంశ్రీ కింద చేర్చిందని గుర్తు చేశారు. అయితే పార్కులో ఇంకా పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చింతలపల్లి వద్ద పార్కులోకి రావటానికి రైల్వే పై ఓవర్ బ్రిడ్జిని కూడా నాడు తమ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆర్వోబీ బ్రిడ్జిని, పార్కులు డ్రైనేజీ, సీవరేజ్ సిస్టంలను పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు.



టెక్స్‌టైల్ పార్కు సందర్శనలో కేటీఆర్, బీఆర్‌ఎస్ నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డి అవినీతి అనకొండ..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సేకరించిన 9300 ఎకరాల భూమి అమ్మకాలతో, ఫ్యూచర్ సిటీ పేరుతో రూ.5 లక్షల కోట్లు దండుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అవినీతి అనకొండగా మారారని కేటీఆర్ ఈ సందర్భంగా తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో కూలీలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 21 పారిశ్రామిక వాడల్లో 9300 ఎకరాలను సేకరించి పరిశ్రమల ఏర్పాటుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషిచేసిందన్నారు. అయితే ఆభూమిని తక్కువ ధరకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రేవంత్‌రెడ్డి కట్టబెడుతున్నారని ప్రజా ధనాన్ని కొల్లగొడుతున్నారన్నారు. స్థానిక మునిసిపాలిటీల తీర్మానం లేకుండా, అఖిల పక్షంతో మాట్లాడకుండా, శాసన సభలో చర్చించకుండా ప్రజాప్రయోజనాలకు సేకరించిన భూములను ఇష్టానుసారంగా ప్రభుత్వం ఎందుకు అమ్ముతుందని నిలదీశారు. సీఎం, అతని అన్నదమ్ములు, అనుచరులు భూములను అమ్మడం ద్వారా, ఫ్యూచర్ సిటీ పేరుతో రూ.5 లక్షల కోట్లు కొల్లగొట్టి రాహుల్‌గాంధీకి ఏటీఎం, పేటీఎంగా మార్చుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, శంకర్‌నాయక్, గండ్ర వెంకటరమణారెడ్డి, తాటికొండ రాజయ్య, జడ్పీ మాజీ చైర్మన్ గండ్ర జ్యోతి, రాకేశ్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం, కార్పొరేటర్ మనోహర్, మాజీ జెడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి నాయకులు జయపాల్‌రెడ్డి, చల్ల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్ →





అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కేటీఆర్ బీఆర్‌ఎస్ నాయకులు ←



సమయం లేదు..

- ఎన్నికల బరిలోకి ఆశావహులు
- పార్టీల పేరు చెప్పుకోవడానికి ఆసక్తి చూపని అభ్యర్థులు
- స్వతంత్ర అభ్యర్థినే ప్రజలు ఆదరిస్తారని బరిలోకి..
- గ్రామానికి పదుల సంఖ్యలో పోటీకి సిద్ధమవుతున్న నాయకులు

ఎల్కతుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సర్పంచ్‌ల ఎన్నికల సందడి ప్రారంభమయ్యింది. రిజర్వేషన్ అనుకూలించిన వ్యక్తులు రంగంలోకి దిగారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో గ్రామాల్లో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. మొదటి విడతలో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్ మండలాల్లో ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ నెల 27 నుంచి నామినేషన్ల స్వీకరణ, అదే రోజు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వార్డుల వారీగా పంచాయతీ ఓటర్ల జాబితా ప్రదర్శన, 29న నామినేషన్ల చివరి తేదీ, 30న నామినేషన్ల పరిశీలన, అదేరోజు చెల్లుబాటైన అభ్యర్థుల జాబితా ప్రదర్శన, డిసెంబరు 1న అభ్యంతరాలపై అప్పీల్‌కు చివరి తేదీ, 2న అప్పీల్ పరిష్కరణకు చివరి తేదీ, 3న నామినేషన్ల ఉపసంహరణ, 3న పోటీలో ఉండే అభ్యర్థుల జాబితా ప్రదర్శన, 11న ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఎన్నికల నిర్వహణకు కేవలం 15 రోజుల సమయం ఉండటంతో పోటీదారులు అయోమయానికి గురవుతున్నారు. ఎన్నికల బరిలో దిగడానికి ఎక్కువ సమయం లేకపోవడంతో బరిలో ఉండే ఆశావహులు ఓటర్లను వేగంగా ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

ఎవరి అంచనాల్లో వారు..

రాజకీయ పార్టీ పరంగా ఎన్నికల బరిలో నిలిస్తే పడే ఓట్లను ఆయా పార్టీ పేరుతో ముందుకెళ్లే అభ్యర్థులు అంచనాలు వేసుకుంటున్నారు. తమ పార్టీకే గ్రామాల్లో ఉనికి ఉందని ఎవరికి వారే ఊహించుకుంటున్నారు. గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరక్కపోవడంతో పార్టీ పేరు చెప్పుకొని పోటీలో ఉంటే ఆదరణ ఉండదని మరికొందరు భావిస్తున్నారు. వ్యక్తిగత పలుకుబడితో స్వతంత్ర అభ్యర్థిగా ప్రజల ముందుకు వెళితే ఆదరిస్తారనే భావనలో కొందరున్నారు. ప్రతీ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థులుగా 10 మందికి పైగానే బరిలో ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఓటర్లు డబ్బు వైపా ? వ్యక్తిత్వం వైపా?

గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసే సర్పంచ్‌లను ఎన్నుకోవడంలో ఓటర్లు డబ్బు వైపు మొగ్గు చూపుతారా? లేదా అభ్యర్థి వ్యక్తిత్వాన్ని బట్టి ఓట్లు వేసి ఎన్నుకుంటారా? అనే ప్రశ్నలు సర్పంచ్ ఆశావహుల్లో అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. సర్పంచ్ బరిలో నిలిచే అభ్యర్థులు కేవలం ఆ పార్టీ పేరు చెప్పుకోవడమే తప్ప పార్టీ ఎలాంటి బీ-ఫారంలు అందించక పోవడంతో ఒకే పార్టీ నుంచి ఎక్కువ సంఖ్యలో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తూ ఆ పార్టీ అభ్యర్థి ఓట్ల కోసం ఓటర్ల వద్దకు వెళ్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు గతంలో చేసిన అభివృద్ధి పనులను వెల్లడిస్తూ ఓట్లను అభ్యర్థించే పనిలో పడ్డారు. కానీ, ఓటర్లు డబ్బులు ఎక్కువగా ఇచ్చిన వ్యక్తులకు ఓట్లు వేస్తారా? గ్రామ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజలతో మమేకమయ్యే అభ్యర్థులకు పట్టం కడుతారా? అనే సందిగ్ధం నెలకొంది. డబ్బు పంచనిదే ఓట్లు పడవని నిర్ధారణకు వచ్చిన వ్యక్తులు ఎన్ని ఓట్లకు ఎంత డబ్బులు పంచాలో లెక్కలు వేసుకుంటున్నారు. ఏదేమైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బుకు ప్రాధాన్యత ఇవ్వాలా.. లేక వ్యక్తిత్వాన్ని చూసి ఓట్లు వేయాలా.. అనే ప్రశ్నలు ఓటర్లను సైతం వెంటాడుతోంది.

ఎల్కతుర్తిలో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఎల్కతుర్తి మండల పరిధిలో 20 గ్రామ పంచాయతీలకు, 103 వార్డులకు, భీమదేవరపల్లి మండల పరిధిలో 25 గ్రామ పంచాయతీలకు, 132 వార్డులకు, కమలాపూర్ మండల పరిధిలో 24 గ్రామ పంచాయతీలకు, 137 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే అధికారులు ఓటరు జాబితాలను సిద్ధం చేసి గ్రామాల్లో ప్రదర్శించడం జరిగింది. ఎన్నికల నిర్వహణ సామగ్రి సైతం సిద్ధంగా ఉండడంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

లిక్కర్ షాపులకు

ఎన్నికల కిక్కు

(5వ పేజీ తరువాయి)

చేయనున్నారు. నామినేషన్ల ఘట్టం 29వ తేదీతో ముగుస్తుంది.

డిసెంబరు 1 నుంచే అసలైన ఎన్నికల సంగ్రామం మొదలు కానుంది. ఇదే తేదీ నుంచి కొత్త మద్యం షాపులు ప్రారంభం కానున్నాయి. ఒక్కొక్క గ్రామంలో 15రోజుల వరకు ఎన్నికల తంతు జరుగుతుంది. అన్ని ప్రధాన పార్టీలు తమ మద్దతుదారులను బరిలో దించేందుకు సిద్ధమవుతున్నాయి. లోకల్‌బాడీ ఎన్నికల్లో మద్యం కీలకమనే బహిరంగ రహస్యమే. పోటీదారులు భారీ ఎత్తున మద్యాన్ని కొనుగోలు చేసి డంప్ చేయటం, ఆ తరువాత పోలింగ్ ముందు పంపిణీ చేయటం జరిగే తంతే. అన్ని ప్రధాన పార్టీలు కూడా ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవటంతో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ తీవ్రంగా ఉండటంతో పాటు లిక్కర్‌కు కూడా భారీగా డిమాండ్ పెరుగనుంది. దీంతో కొత్తగా మద్యం షాపులను దక్కించుకున్నవారికి పంచాయతీ ఎన్నికలతో భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉందనే టాక్ వినబడుతుంది.

- కలిసి వస్తున్న అదృష్టం..

కొత్త మద్యం షాపు యాజమానులకు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మేడారం మహజాతరకు కూడా కలిసి రానుంది. డిసెంబరు 17వ తేదీతో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. ఈ ఎన్నికల తరువాత జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మేడారం మహజాతర ఉంది. దీంతో పల్లెల్లో నెల రోజుల ముందు నుంచి ఊళ్లలో బద్దిపోశమ్మ, మైసమ్మ, ఎల్లమ్మలకు వేడుకలు చేయటం ఆనవాయితీగా వస్తుంది. వీటితో పాటు ఇంటి వద్ద సమ్మక్క, సారలమ్మల పండుగ జరుపుకుంటారు. దీంతో మద్యం అమ్మకాలకు భారీగా డిమాండ్ పెరుగనుంది. మేడారం మహజాతరతో పాటు జాతరకు ముందు మొక్కులు కూడా మద్యం వ్యాపారానికి కలిసి రానుంది.

అలాగే ఇప్పటికే వాయిదా పడిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు కూడా జనవరి లేదంటే ఫిబ్రవరి, మార్చిలో నిర్వహించే అవకాశం ఉంది. ఇప్పటికే మునిసిపాలిటీల పదవీకాలం కూడా పూర్తయింది. గ్రేటర్ వరంగల్ పాలక వర్గం కూడా జూన్ నెలతో ముగుస్తుంది. దీంతో వరుసగా పరిషత్తు, మునిసిపాలిటీ ఎన్నికలు రానుండటం మద్యం షాపు యాజమానుల పంట పండినట్లేననే చర్చ జరుగుతోంది. ఈ ఏడాదంతా ఏదో రకంగా మద్యానికి గిరాకీ వస్తుండటంతో మద్యం షాపులు దక్కని వ్యాపారులు భారీగా గుడ్‌విల్ ఆఫర్ చేసి చాల చోట్ల షాపులను కొనుగోలు చేశారని తెలిసింది. ఆయా ఏరియాలను బట్టి మద్యం షాపులకు రూ.60లక్షల నుంచి రూ.1.35కోట్ల వరకు గుడ్‌విల్ ఇచ్చి వ్యాపారులు కొనుగోలు చేసినట్టు చెబుతున్నారు.

ఎన్నికలను పటిష్ఠంగా నిర్వహించాలి

- నియమావళి కట్టుదిట్టంగా అమలు చేయాలి
- నామినేషన్ల స్వీకరణకు పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టాలి
- మొదటి విడత నోటిఫికేషన్ సజావుగా జారీ చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని



వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు కలెక్టర్ దివాకర, ఎస్పీ రాంనాథ్

ములుగు కలెక్టరేట్/భూపాలపల్లి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఆమె బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించయారు. ములుగు కలెక్టరేట్ నుంచి ఆ జిల్లా కలెక్టర్ దివాకర, భూపాలపల్లి నుంచి ఆ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని గ్రామపంచాయతీల ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని అన్నారు. డిసెంబరు 11న మొదటి విడత, 14న రెండో విడత, 17న మూడో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరుగనున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గ్రామానికి అప్‌డేట్ చేసిన రిజర్వేషన్లు, ఏ విడత పోలింగ్ ఉంటుంది, పోలింగ్ కేంద్రాల జియో లొకేషన్ వివరాలు వెంటనే టీపోల్ వెబ్‌సైట్, యాప్‌లో నమోదు చేయాలన్నారు. టీపోల్ వెబ్‌సైట్, యాప్‌లో వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లాలో నోడల్ అధికారిని నియమించాలన్నారు. ఎన్నికల కమిషన్‌కు వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. రెండు కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న భవనం దగ్గర హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. వెబ్‌కాస్టింగ్ జరిగే పోలింగ్ కేంద్రాల వివరాలు పంపాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మంచి వెలుతురు, ఫర్నిచర్, విద్యుత్, తాగునీటి సరఫరా వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ నవంబరు 27న ఉదయం 10.30 గంటల వరకు విడుదల చేయాలన్నారు. నోటిఫికేషన్ జారీ చేయడంతోపాటు పంచాయతీ పరిధిలోని ఓటరు జాబితా వివరాలను ప్రచురించాలన్నారు. నవంబరు 27 నుంచి 29 వరకు రోజూ ఉదయం, సాయంత్రం వరకు నామినేషన్లను స్వీకరించాలన్నారు. రిటర్నింగ్ అధికారుల వద్ద నామినేషన్ దాఖలు చేసేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. నామినేషన్ల పరిశీలన నవంబరు 30న సాయంత్రం 5గంటల వరకు పూర్తిచేసి చెల్లుబాటైన నామినేటెడ్ అభ్యర్థుల జాబితాను ప్రకటించాలన్నారు. అభ్యర్థుల జాబితాపై అప్పీళ్ల కోసం డిసెంబరు 1న సాయంత్రం 5గంటల వరకు గడువు ఉంటుందని తెలిపారు. డిసెంబరు 2న అప్పీళ్లను పరిష్కరించాలని, నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబరు 3 మధ్యాహ్నం 3గంటల వరకు గడువు ఉంటుందని అన్నారు. అదేరోజు పోటీచేసే అభ్యర్థుల జాబితా ప్రచురించాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీచేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా అవసరమైన మార్గదర్శకాలను జిల్లా ఎన్నికల అధికారులు జారీ చేయాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రింటర్లకు అనుమతి లేకుండా ఎన్నికల ప్రచార కరపత్రాల ముద్రణ చేయొద్దని ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి అభ్యర్థుల వ్యయ వివరాలను నమోదు చేసేందుకు ధరలను ఖరారు చేయాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. ప్రతి మండలానికీ ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, ఒక ఏఈవో, ప్రతి జిల్లాకు ఒక స్టాటిక్ సర్వేలెన్స్ బృందం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తప్పనిసరిగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో ఎంసీఎంసీ కమిటీ, జిల్లా మీడియా సెల్ ఏర్పాటు చేయాలని, ఎన్నికల ప్రచార సమయంలో వినియోగించే ఎలక్ట్రానిక్ వీడియోలకు ముందుగా ఎంసీఎంసీ అనుమతి ఉండాలన్నారు. ఎన్నికల దృష్ట్యా తనిఖీలు నిర్వహించే నేపథ్యంలో రైతులు పంట డబ్బులు తీసుకువెళ్లే సమయంలో తప్పనిసరిగా రశీదు ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎంసీఎంసీ అమలులో నిర్వహించే తనిఖీలలో నగదు, బంగారం, ఇతర పరికరాలు సీజ్ చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు అందించాలని, సీజ్ చేసిన పరికరాలకు సంబంధించిన ఆధారాలు సమర్పించేందుకు ఏ అధికారి ముందు హాజరు కావాలోననే వివరాలు రశీదులో ఉండాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేశ్, జిల్లా పంచాయతీ ఇన్‌చార్జి అధికారి శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం


సుబ్రహ్మణ్య స్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న పురోహితులు

వెంకటాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని శ్రీ ఉమారామ లింగేశ్వర స్వామి ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీవల్లిదేవ సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం బుధవారం ఘనంగా జరిగింది. సుబ్రహ్మణ్యస్వామి షష్టి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో పురోహితులు రామశర్మ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మండల అభివృద్ధికి సహకరించండి


ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న నేతలు

వాజేడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి సహకరించాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌ను వాజేడు కాంగ్రెస్ సీనియర్ నాయకులు దంతులూరి విశ్వనాథ ప్రసాద బాబు రాజు, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగాసి రమేష్ కోరారు. బుధవారం వారు ఎంపీని కలిసి వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా మండలంలోని పేరూరు, ధర్మ వరం, అయ్య వారిపేట గ్రామాల్లోని రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకు ఇబ్బం దులు పడుత ఎన్నారని, రోడ్లను మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

చిరుతపల్లిలో వైద్య శిబిరం

వెంకటాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుతపల్లి గ్రామంలో బుధవారం వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం జరిగింది. ఈసందర్భంగా వైద్యాధికారి భాస్కర్ గ్రామస్థులతోపాటు ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు దరిచేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిబిరంలో హెచ్‌ఈవో కోటిరెడ్డి, స్టాఫ్‌నర్సు స్వప్న, పాఠశాల హెచ్‌ఎం సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు విస్మరించిన కాంగ్రెస్ : బీఆర్ఎస్

వాజేడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమళ్ల రామకృష్ణారెడ్డి విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడంలో విఫలమైందని దుయ్యబట్టారు. 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.2,500 ఎప్పుడిస్తారని, వితంతువులకు రూ.4వేలు, కల్యాణ లక్ష్మిలో తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. పంచాయతీ ఎన్నికల్లో ఓట్లకోసం చీరలు పంచి మరోసారి మహిళలను మోసగించేందుకు యత్నిస్తోందని విమర్శించారు.

పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

మంగపేట నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగకపోవడంతో మండలంలో పరిపాలన కుంటుపడుతోందని ఎస్సీ, బీసీ సంఘాల మండల నాయకులు గుగ్గిళ్ల సురేష్ మాదిగ, శ్రీనివాసాచారి కోరారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన ప్రజా సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల విషయంలో వివాదం త్వరగా తేలేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ, బీసీ ప్రజా సంఘాల నాయకులు ఈసంపల్లి సురేందర్, దంతనపల్లి నరేందర్, పరికి శ్రీనివాస్, యాసం హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన రవాణా శాఖ జిల్లా అధికారి

ములుగు కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ములుగు ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సుధీర్ రాంనాథ్ కేకన్‌ను రవాణా శాఖ జిల్లా అధికారి బారాగాడి శ్రీనివాస్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్టీకి 'చింతగూడ' కేటాయించడంపై హర్షం

కన్నాయిగూడెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగూడ సర్పంచ్ స్థానాన్ని ఎస్టీకి కేటాయించడంపై తుడుందెబ్బ మండల అధ్యక్షుడు ఆలం రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కలెక్టర్ రాహుల్ శర్మ, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రాకు కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రంలోని కుమరంభీం విగ్రహం వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ గిరిజన గ్రామమైన చింతగూడను బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీగా ఏర్పాటు చేయగా అధికారులు గత సర్పంచ్ ఎన్నికల సమయంలో ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించారని గుర్తు చేశారు. ఇప్పుడు గిరిజన గ్రామంలో ఎస్టీలకే సర్పంచ్ రిజర్వేషన్ కేటాయించాలని కోరుతూ ఆదివాసి నాయకులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా అధికారులు స్పందించారన్నారు. సర్పంచ్ స్థానాన్ని ఎస్టీకి కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ప వగడయ్య, మేడారం సమ్మక్క పూజారి సిద్ధబోయిన సురేందర్, నాయకులు పొడెం నర్సింగరావు, కోరం రాజు, ఆలం భాస్కర్, ఇర్ప కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

గోవిందరావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికల్లో భాగంగా బుధవారం పస్రా సీఐ దయాకర్, ఎస్సై కమలాకర్‌లు పోలీస్ సిబ్బందితో కలిసి మండలంలోని పస్రా, గోవిందరావుపేట, చల్వాయి, దుంపెల్లిగూడెం, కర్లపల్లిలో గల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా వారు నామినేషన్‌కు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

కర్రి నాగేంద్రబాబు జన్మదిన వేడుకలు

మంగపేట నవంబరు26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ ములుగు జిల్లా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్రబాబు జన్మదిన వేడుకలను ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర సెక్రటరీ కుంజా సూర్య హాజరై నాగేంద్రబాబుతో కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ముత్తినేని ఆదినారాయణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్‌ఖాన్, నాయకుడు తుడి భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

మల్హర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లెంకుంట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం బాల్య విహహాల నిర్మూలనపై విద్యార్థినులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిమాణాల గురించి చైల్డ్ కోఆర్డినేటర్ గుర్రం తిరుపతి వివరించారు. డీహెచ్‌ఈడబ్ల్యూ, బీఆర్‌బీ, సఖీ విభాగాల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆపదలో ఉన్న బాల బాలికల రక్షణ కోసం ప్రభుత్వం కల్పించిన టోల్ ఫ్రీ నంబర్లు 1098, 181, 1930పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ ప్రతినిధి అనూష, సఖి మాధవి, ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏడీఈగా రమేష్

కాటారం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ కాటారం సబ్ డివిజన్ ట్రాన్స్‌కో ఏడీఈగా బడేల రమేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల చేపట్టిన పదోన్నతుల్లో భాగంగా కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ఏఈగా విధులు నిర్వర్తించిన ఆయన కాటారం ఏడీఈగా వచ్చారు. రమేష్‌ను డివిజన్ పరిధిలోని పలు మండలాల ఏఈఈలు ఉపేందర్, శ్రీకాంత్, శేఖర్, మంగీలాల్, ప్రశాంత్, లైన్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కాంత్, లక్ష్మినారాయణ, కుమారస్వామి, బిక్యానాయక్, సబ్ ఇంజనీర్లు చందర్‌రెడ్డి, రాజ్‌కుమార్, కొమురయ్య, కుమార్, లైన్‌మెన్లు ప్రవీణ్, చంద్రమౌళి, తిరుపతి, జేఎల్‌ఎంలు శ్రీకాంత్, రమేష్, రాజేందర్, శ్రీనివాస్ తదితరులు బొకే అందించి శాలువాతో సన్మానించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాటారం డివిజన్ డీఈఈ నాగరాజు, విద్యుత్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అందుబాటులో రాయితీ విత్తనాలు

కాటారం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా యాసంగి సీజన్‌కు సబ్సిడీపై వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ శాఖ మండల అధికారి పూర్ణిమ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం) కింద మండలానికి దొడ్డు రకం వడ్లు 40క్వింటాళ్లు (160బస్తాలు), సన్న రకం వరి విత్తనాలు 40 క్వింటాళ్లు (160బస్తాలు) వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ సీడ్స్ కంపెనీ ద్వారా ఆర్‌ఎన్‌ఆర్-15048 (తెలంగాణ సోనా), కేఎన్‌ఎం-1638, జేజీఎల్-24423, కేఎన్‌ఎం-118 రకాల వరి విత్తనాల బస్తాలు రైతులకు 50శాతం రాయితీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. మన గ్రోమోర్, ఆగ్రోస్ రైతు సేవాకేంద్రంలో బస్తాలు అందుబాటులో ఉన్నాయని, విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత క్లస్టర్ ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

వికలాంగుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం

మహదేవపూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఏర్పడి 18 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సంబరాలు చేసుకున్నారు. ఆ సంఘం టౌన్ అధ్యక్షుడు మీర్జా ముస్తాక్ బేగ్, ఎమ్మార్పీఎస్ మండల బెల్లంపల్లి సురేష్, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు వీరగంటి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మొగుళ్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బాధిత కుటుంబాలను మాజీ ఎంపీపీ నలబీం విజయలక్ష్మి-మల్లయ్య బుధవారం పరామర్శించారు. మండలంలోని పెద్దకోమటిపల్లికి చెందిన దుర్శెట్టి పెద్దులు, కొర్కిశాలకు చెందిన రేణికుంట్ల రాజ్‌కుమార్, మండల కేంద్రంలోని క్యాత రాజు సమ్మయ్య కుటుంబాలను ఆమె ఆర్థికసాయం అందజేశారు. ఆమె వెంట కొర్కిశాల మాజీ సర్పంచ్ దానవేని రాములు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం


ములుగులో గిరిజన వర్సిటీలో రాజ్యాంగంపై మాట్లాడుతున్న వీసీ


కాటారంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్‌సీవో, ప్రిన్సిపాల్

భూపాలపల్లిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠికను కలెక్టర్ రాహుల్ శర్మ చదివి వినిపించారు. భారత రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సూత్రాలపై అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● ములుగు రూరల్ (ఆంధ్రజ్యోతి): సమ్మక్క సారక్క ట్రైబల్ యూనివర్సిటీలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి వైస్ చాన్సలర్ వై.ఎల్.శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించారు. భారత రాజ్యాంగం రూపొందించిన తర్వాతే దేశం భిన్నత్వంలో ఏకత్వంగా రూపొందిందని అన్నారు. విద్యార్థుల చేత రాజ్యాంగ పీఠికను సామూహికంగా చదివించారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవాన్ని మండల కేంద్రంలోని తెలంగాణ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. తెలంగాణ అంబేడ్కర్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంఘం మండల అధ్యక్షుడు యెంపెల్లి వీరాస్వామి, అంబేడ్కర్ విగ్రహ దాత చెట్టుపల్లి వెంక టేశ్వర్లు, అంబేడ్కర్ సంఘం నాయకులు పగిడిపల్లి వెంకటే శ్వర్లు, ఎర్రం స్వామి, ఎడ్ల నరేష్, ఎల్.పి.ముత్యాలు, బసారికాని హరికృష్ణ, గుళ్లగట్టు విజయరావు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి దళిత, బహుజన, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంపల శివకుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘులు, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్, ప్రజా సంఘాల నాయకులు వావిలాల నరిసింహారావు, పడిదల హనుమంతు, వావిలాల సాంబశివరావు, కొండగొర్ల పోచయ్య, దొంగిరి మధు, తాజ్, కందుకూరి రతన్ తదితరులు పాల్గొన్నారు.

● వాజేడు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఎంపీవో శ్రీకాంత్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసం దర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీవో శ్రీకాంత్‌నాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు. బడుగు, బలహీన వర్గాలతోపాటు అన్ని వర్గాల ప్రజలకు రాజ్యాంగాన్ని అందుబాటులోకి తెచ్చిన గొప్ప మహానుభావుడు అంబేడ్కర్ అని కొనియాడారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

● ములుగు టౌన్ (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవాన్ని వివిధ ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు, ప్రజా సంఘాల నేతలు మరాఠి రవీం దర్, కలువల రవీందర్, బొమ్మకంటి రమేష్ వర్మ, రత్నం ప్రవీణ్, రాజశేఖర్, జనార్దన్, దేవేందర్, కుమారస్వామి, కార్తీక్, కడారి సాం బయ్య, రొంటాల జనార్దన్, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలు, జీపీ కార్యాలయాలో టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. కాటారం ఎస్టీ బాలుర గురుకులంలో ఆర్‌సీవో హరిసింగ్, ప్రిన్సిపాల్ రాజేందర్, టీచర్లు, విద్యార్థులు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటం వద్ద ఘనంగా నివాళుల ర్పించి ర్యాలీ చేపట్టారు. ప్రాథమిక పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ కార్యదర్శులు సమీర్‌ఖాన్, ఉమాదేవి, శంకర్, కర్నాకర్, శ్రీనివాస్, రాకేష్, జ్యోత్స్న, కృష్ణవేణి, రాజశేఖర్, నవ్యశ్రీ, దేవేందర్, శేఖర్, గంగాదరన్, ప్రవీణ్, శివ, సురేష్, సాయి, అపర్ణ, లక్ష్మి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు

● చిట్యాల (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లగరిగలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి అంబేద్కర్‌వాది నోముల శివశంకర్ పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. అనంతరం రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్ర మంలో యువజన సంఘం నాయకులు కొల్లూరి అశోక్, దూడపాక సరోత్తం, సురేందర్, జేరిపోతుల ఓదెలు, సిరిపెల్లి జంపయ్య, నోముల నాగరాజు, మరియమ్మ, యశోద, రామస్వామి, నితిన్ పాల్గొన్నారు.ఆ


వాజేడులో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీవో

కోడ్ వచ్చిందని..



వెంకటాపురంలో విగ్రహానికి ముసుగు వేస్తున్న సిబ్బంది, ఏటూరునాగారంలో ఫ్లెక్సీ తొలగింపు

వెంకటాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈసందర్భంగా మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ సిబ్బంది రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలు కనపడకుండా క్లాత్‌తో మూసివేశారు. వాల్ రైటింగ్‌లు, పోస్టర్లను తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ నేటినుంచి స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసేవరకు ఎన్నికలకోడ్ అమలులో ఉంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది శ్రీను, బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మండలంలోని ఆయా కార్యాలయాలు, ప్రధాన కూడళ్లల్లో ప్రభుత్వ ప్రచార పోస్టర్లు, రాజకీయ నాయకుల బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించారు. విగ్రహాలపై ముసుగును కప్పారు. శంకుస్థాపనలకు సంబంధించిన శిలాఫలకాలను క్లాత్‌తో మూసివేశారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. పలు గ్రామ పంచాయతీల పరిధిలోని బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడగడంతో పాటు ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బోర్డులు, వాల్ రైటింగ్స్‌ను తీసేసే పనిలో జీపీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది నిమగ్నమయ్యారు. కాగా కొన్ని జీపీల పరిధిలో కోడ్ సరిగా అమలు కావడంలేదని ఆరోపణలున్నాయి.


కాటారంలోశ్రీపాదరావు విగ్రహానికి ముసుగు వేస్తున్న జీపీ సిబ్బంది

పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. ఈ నెల 29 వరకు నామినేషన్లు స్వీకరించాలన్నారు. ఈ నెల 30న నామినేషన్ల పరిశీలన, డిసెంబరు 1న అప్పీళ్లు, 2న డిస్పోజల్స్, 3న ఉపసంహరణ ఉంటుందని వివరించారు. నామినేషన్లు స్వీకరణకు 25 మంది రిటర్నింగ్ అధికారులను నియమించాలని తెలిపారు. ప్రతి రిటర్నింగ్ అధికారుల కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక వ్యక్తి నాలుగు సెట్లు నామినేషన్లు దాఖలు చేసేలా అవకాశం ఉంటుందని తెలిపారు. నామినేషన్‌లో కచ్చితంగా తేదీ, సమయం, క్రమసంఖ్య తప్పనిసరి ఉండాలన్నారు. అలాగే నామినేషన్ల పత్రంలో సంతకాలు ఉండాలన్నారు. అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి సంతకం కూడా ఉండాలని తెలిపారు. మొదటి విడతలో నాలుగు మండలాల్లోని 82 గ్రామపంచాయతీల పరిధిలోని 712 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారి విధులు అత్యంత కీలకమన్నారు. ఎన్నికలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం మాస్టర్ ట్రెయినర్లు ఎన్నికల విధులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, డీపీవో శ్రీలత, ఎంపీడీవోలు, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.